క్లుప్తంగా

చదువుతో పాటు విజ్ఞానం అవసరం


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదువుతో పాటు వ్యవసాయ విజ్ఞానంపై అవగాహన ఎంతో అవసరమని కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులకు ఆర్ఏడబ్ల్యూపీ పోగ్రాం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వ్యవసాయ రంగంపై అవగాహన పెంపొందించుకుని రైతాంగ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. గ్రామీణ పటం, కాలక్రమనం, బార్ గ్రాఫ్, చెట్టు విశ్లేషణ, సీజనల్ అగ్రికల్చర్ క్యాలెండర్, మాట్రిక్ ర్యాగింగ్, వెన్ రేఖాచిత్రం, ట్రెండ్ విశ్లేషణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ జీటీ మాధవి, డాక్టర్ మాధవి, డాక్టర్ శశికళ అగ్రికల్చర్ విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.

సన్మానం


ముస్లిం, మైనార్టీ సెల్ స్టేట్ సెక్రటరీ ఖాజా మైనుద్దీన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఖాజా మైనుద్దీన్ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర సెక్రటరీగా ఇటీవల ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లయ్యయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్‌యాదవ్, కౌన్సిలర్లు వరదరాజులు, ఫరూక్, కేవీ రమణ, వాల్మీకి శివ, సర్పంచు చిదంబరి తదితరులు మైనుద్దీన్ ఇంటికి వెళ్లి అభినందించారు. శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రంగస్వామి, జీపు రమణ, రాజన్న, నరసింహులు, నారాయణ స్వామి, చిన్న పులప్ప, మల్లి,కుమార్, కేఎం రంగనాయకులు, స్టోర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల నిరసన


డీఈకి వినతి పత్రం అందజేస్తున్న మీటర్ రీడర్లు

గుత్తి: గుత్తిలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం వద్ద తమ డిమాండ్లను పరిష్కరించాలని విద్యుత్ మీటర్ రీడర్స్ మంగళవారం ఆందోళన చేపట్టారు. మీటర్ రీడర్స్ అసోసియేషన్ సెక్రటరీ రంగస్వామి ఆధ్వర్యంలో మీటర్ రీడర్స్ ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ రీచార్జ్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో తాము ఉపాధి కోల్పోయే అవకాశముందని,ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం ఇవ్వాలని, విద్యుత్ శాఖలోనే ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏపీఎస్పీడీసీఎల్ డీఈకి అందజేశారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జి.ఎర్రగుడి గ్రామంలో మంగళవారం ట్రాక్టర్‌లోకి రాళ్లు లోడ్ చేస్తుండగా చేతిపై రాళ్లు పడి పాయసం రాజు అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. జి.ఎర్రగుడి గ్రామానికి చెందిన పాయసం రాజు అనే యువకుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్తూ కూలీ పనులు కూడా చేస్తాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌లో రాళ్లు లోడ్ చేస్తున్న సమయంలో ట్రాలీలో పైకి విసిరినప్పుడు పైనున్న రాళ్లు కిందకు దొర్లి రాజు ఎడమ చేతి వేళ్లపై పడ్డాయి. రాళ్లు చేతి వేలికి ఉన్న ఉంగరంపై పడటంతో ఉంగరం గుచ్చుకొని రాజు తీవ్రంగా గాయపడి రక్తస్రావమైంది. అపస్మారక స్థితికి చేరుకున్న రాజును గమనించిన తోటి కూలీలు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వేలికి గుచ్చుకొని ఇరుక్కున్న ఉంగరం తీసేందుకు ఆస్పత్రి సిబ్బంది ప్రయత్నం చేసినా రాలేదు. శస్త్ర చికిత్స చేసి ఉంగరం తొలగించాలని వైద్యులు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం రాజును గుంతకల్లుకు తరలించారు.

సబ్ జైలు తనిఖీ


సబ్ జైలును తనిఖీ చేస్తున్న లీగల్ సెల్ సెక్రెటరీ శివప్రసాద్‌యాదవ్

గుత్తి: పట్టణంలోని స్పెషల్ సబ్ జైలును మంగళవారం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శివ ప్రసాద్ యాదవ్, మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు జైలులోని వార్డులు, బ్యారెక్‌లు, బాత్ రూమ్‌లు, టాయిలెట్లు, వంట గది తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఖైదీలతో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, సిబ్బంది పాల్గొన్నారు.



ఈ చిత్రంలోని మహిళ పేరు లాలెమ్మ. భర్తతో కలసి రోజూ ఉపాధి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత రెండు నెలలుగా కూలి డబ్బులు అందకపోవడంతో పస్తులుండాల్సి వస్తోంది. అధికారులను అడిగితే 'మా చేతిలో ఏంలేదు' అంటున్నారు. ఉపాధి కూలి అందకపోవడంతో ఏం చేయాలో దిక్కు తోచడం లేని ఆవేదన వ్యక్తం చేసింది. వేరే పనులకు వెళ్లామంటే ఎక్కడా పనులు లేవు. ఇక వలసే శరణ్యమని ఆమె వాపోయింది.


వైటీ చెరువు గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఉపాధి కూలీల వేతన వెతలు

- మూడు నెలలుగా అందని కూలి డబ్బులు
- పట్టించుకోని అధికారులు

గుంతకల్లు రూరల్: ఉపాధి కూలీలకు మూడు నెలలుగా కూలి అందకపోవడంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 11081 జాబ్ కార్డులుండగా 21 వేల మందికి పైగా ఉపాధి కూలీలు ఉన్నారు. వీరిలో దాదాపు 10 వేల మందికి పైగా కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువైన తరువాత ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అయితే గుంతకల్లు మండలంలో ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాన్ని చేపట్టకపోవడంతో.. ఉపాధి పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. వేసవిలో మండే ఎండల నేపథ్యంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో 20 శాతం అలవెన్సు, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం అలవెన్సును గత ప్రభుత్వం అదనంగా కూలీలకు అందజేసేది. వేసవిలో కూలీలకు మజ్జిగను పంపిణీ చేయడంతో పాటు, ఎండల్లో పనిచేసే కూలీలు కాసేపు సేద తీరేందుకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. ఇవేవి లేకపోగా ఈ ఏడాది అలవెన్సుకూడా ప్రకటించకపోవడం, గత మూడు నెలలుగా ఉపాధి కూలీల వేతన బకాయిలను ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో కూలి డబ్బులు అందక కుటుంబ పోషణ భారంగా మారి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న కూలీలు క్రమంగా ఉపాధి పనులకు స్వస్తి పలుకుతూ ప్రత్యామ్నాయ పనులను వెతుక్కునే పనిలో పడ్డారు. దీంతో దాదాపు 10 వేల మందికి పైగా హాజరవాల్సిన ఉపాధి కూలీల సంఖ్య ప్రస్తుతం 1,500 మందికి పడిపోయింది. ఖరీఫ్, రబీ వ్యవసాయ సీజన్‌లు ముగిశాక మండలంలో కేవలం బోరు కింద సాగుచేసిన పంట పొలాల్లో మాత్రమే కూలి పనులు చేసుకునే అవకాశం ఉండటం, ఆ పనులు ఎక్కువ మందికి సరిపోకపోవడంతో దిక్కుతోచని కూలీలు మూటముల్లె సర్దుకొని వలసబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బకాయిలను విడదల చేయకపోతే గ్రామాలు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది.

మండలం	గుంతకల్లు
పంచాయతీలు	25
గ్రామాలు	39
జాబ్‌కార్డులు	11,081
ఉపాధి కూలీలు	21,000
పెండింగ్ బిల్లులు	రూ.2 కోట్లకు పైగా

ఉపాధి పనులే ఆధారం



గ్రామంలో వ్యవసాయ పనులు లేకపోవడంతో భార్యతో కలసి ఉపాధి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. జనవరి నుండి కూలి డబ్బులు పడకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. బయట అప్పులు పుట్టే పరిస్థితి కూడా లేకపోవడంతో తినడానికి కూడా కష్టంగా ఉంది. ఈ విషయై అధికారులు స్పందించి కూలీలకు న్యాయం చేయాలి.

– రామాంజనేయులు, ఉపాధి కూలీ, కసాపురం

కష్టాలు పడుతున్నాం..



రెక్కాడితే గాని , డొక్కాడని కుటుంబం మాది. రెండు నెలలు భర్తతో కలసి ఉపాధి పనులు చేస్తున్నా కూలి డబ్బులు పడలేదు. గతంలో కూలిడబ్బులకు అదనంగా అలవెన్సు ఇచ్చేవారు. ఈ సంవత్సరం అది కూడా ఇవ్వడం లేదు. దీంతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలో తెలియక నానా కష్టాలు పడుతున్నాం. పరిస్థితి ఇలాగే కొనసాగితే బతుకు తెరువు కోసం వలస వెళ్లాల్సిందే.

– సుధామణి, ఉపాధి కూలీ, వైటీ చెరువు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఈ ఏడాది జనవరి 13న కూలీలకు కూలి డబ్బులు వారి ఖాతాల్లో జమ అయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి దాకా కూలి డబ్బులు జమ కాలేదు. దీంతో కొంత ఇబ్బందిగా మారిన పరిస్థితి వాస్తవమే. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య ఉంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. త్వరలోనే కూలీల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూస్తాం

– క్రిష్ణమూర్తి, ఏపీఓ

సీమ రైతులకు శాపంగా బాబు నిర్ణయాలు

గుంతకల్లు: సీఎం చంద్రబాబు నిర్ణయాలు రాయలసీమ రైతులకు శాపంగా మారాయని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఆయన మంగళవారం గుంతకల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చూడితే..చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల ప్రయోజనాల కోసం తూట్లు పొడుస్తున్నారన్నారు. ఏపీకి కళ్ల ముందే తెలంగాణ ప్రభుత్వం అన్యాయం చేస్తున్నా ప్రశ్నించలేని అసమర్థుడు చంద్రబాబు అని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రాయలసీమతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు, తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో రాయలసీమ ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారన్నారు. నేడు చంద్రబాబు ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగారెడ్డి, గోపాల్‌రెడ్డి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సమస్యలను పరిష్కరించండి


గుంతకల్లులో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు

గుంతకల్లు: ఓటర్ల సమస్యలు గుర్తించి పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్డీఓ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఓటర్ల ఇబ్బందులు, పోలింగ్ బూత్ సర్దుబాట్లు, బూత్‌ల పెంపు తదితర అంశాలపై సలహాలు, సూచనల కోసం రాజకీయా పార్టీ నాయకులుతోపాటు తహసీల్దార్లు, కమిషనర్లుతో ఆర్డీఓ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఎండీఆర్ ఖలీల్, నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్ తదితరులు ఓటర్ల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఓటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, కమిషనర్ నయీమ్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దికేర ప్రతాప్, టీడీపీ నాయకులు ముక్కనగారి రామాంజనేయులు, గుజరి ఖాజా పాల్గొన్నారు.

శింగనమల: ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మల్లికార్జునుడు అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారుల విధులు, ఓటరు నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపులు గురించి ఆయన వివరించారు. నియోజకవర్గంలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: విద్యార్థులు చదువుతో పాటు నూతన టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఆర్ఐటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రంజిత్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విభాగం సీఎస్ఈ, సీఎస్ఈ (ఏఐ అండ్ ఎంఎల్) విద్యార్థులకు ఎడునెట్ ఫౌండేషన్ వారి అనుబంధంగా ఐఆర్ 4.0 ఫౌండేషన్ కోర్స్ పైథాన్ పోగ్రామింగ్ లాంగ్వేజ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు కొత్త టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ మాట్లాడుతూ అకాడమిక్ నుండి మాత్రమే కాకుండా ఇలాంటి కార్యక్రమాల వలన విద్యార్థులు ఆచరణాత్మక జ్ఞానం పొందుతారన్నారు. కార్యక్రమానికి ఎడునెట్ ఫౌండేషన్ మాస్టర్ ట్రైనర్ రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ భార్గవరెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ వీర ప్రకాష్, సీఎస్ఈ డేటా సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ చిత్ర లింగప్ప, ఐఐఐ సెల్ ముఖ్య కోఆర్డినేటర్ డాక్టర్ హేమంత్‌కుమార్, పోగ్రాం కోఆర్డినేటర్స్ కామాక్షమ్మ, లోకేష్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

బోధన ప్రమాణాలు మెరుగుపడాలి


మాట్లాడుతున్న అకడమిక్ బృందం సభ్యురాలు సైఖ్యాపర్వీన్

గుంతకల్లు: బోధన ప్రమాణాలు మెరుగుపడితే విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందని అకాడమిక్ బృందం సభ్యులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో మంగళవారం మంగళగిరి విజయవాడ ద్వారా నియమించిన అకాడమిక్ ఆడిట్ బృందం సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి.క్రాంతికుమార్‌తోపాటు అనంతపురం కేఎస్ఎస్ ప్రభుత్వ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు జే.సైఖ్యాపర్వీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా 2023–24, 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి కళాశాల ప్రగతి, విద్యా బోధన ప్రమాణాలను, మౌలిక సదుపాయాలు, అభివృద్ధిపై ఆరాతీశారు. అంతేకాకుండా కళాశాలలో ఏర్పాటు చేసిన అధునాత జీమ్ పరికరాలు, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ క్లాస్ రూమ్స్, వర్చువల్ క్లాస్ రూమ్స్ సైన్స్ ల్యాబరేటర్, లైబ్రరీ తరగతి గదులను పరిశీలించారు. అన్ని అంశాలపై పూర్తి స్థాయి సమీక్ష చేసిన అకాడమిక్ బృందం కళాశాలకు 'ఏ' గ్రేడ్‌ను ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడిపత్రి రూరల్ : స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు దయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం శంకర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు 9959225856 నంబర్‌కు ఫోన్ చేసి సూచనలు, సలహాలను అందజేయాలన్నారు.

21 నుంచి 'మీ మాటే ముఖ్యం'

తాడిపత్రిటౌన్: ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఈనెల 21 న'మీ మాటే ముఖ్యం' కార్యక్రమం ప్రారంభించనున్నారు. తాడిపత్రి పట్టణంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఐదు పోలీస్‌స్టేషన్లుండగా ఒక్కో పోలీస్‌స్టేషన్‌లో వరుసగా రెండు రోజులు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 21, 22న యాడికి, 24, 25న పెద్దపప్పూరు, 26, 27న పెద్దవడుగూరు, 28, 29న తాడిపత్రి రూరల్, 2,3 తేదీల్లో తాడిపత్రి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఆయా పోలీస్‌స్టేషన్‌లలో అందుబాటులో ఉండి ప్రజలతో నేరుగా సమస్యలు తెలుసుకుంటామన్నారు. అలాగే ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక ఫిర్యాదుల బాక్స్‌ను ఏర్పాటు చేసి సమస్యలు స్వీకరిస్తామన్నారు. ఫిర్యాదు దారుడి పేరు రాసినా రాయకపోయినా ఫిర్యాదు స్వీకరిస్తామన్నారు. ఫిర్యాదులో నిజానిజాలు తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. మట్కా, పేకాట, గంజాయిని రూపుమాపేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

'కోన' హుండీ ఆదాయం రూ. 12.20 లక్షలు

తాడిపత్రి: మండలంలోని ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 12,20,291 సమకూరినట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ ఎం.వన్నూరుస్వామి పర్యవేక్షణలో మంగళవారం హుండీల్లోకి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు యోగానందమయ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

బైక్ బోల్తా.. యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి రాజేష్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన రాజేష్ మార్నేపల్లి శివారులో ఉన్న బంకులో పెట్రోల్ వేయించుకునేందుకు బైక్‌లో బయలుదేరాడు. రజాపురం గ్రామ శివారులో రోడ్డు డైవర్షన్ కోసం వేసిన మట్టి కుప్పను గమనించకుండా వెళ్లి ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీ నరసింహస్వామి పాదాలను తాకిన సూర్య కిరణాలు

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో కొండపై లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలోని మూలవిరాట్‌ను మంగళవారం సూర్య కిరణాలు తాకాయి. నరసింహస్వామి పాదాలను సూర్య కిరణాలు తాకిన దృశ్యాన్ని చూడటానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు చేశారు.

కుక్కకాటుతో విద్యార్థికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లిలో మహేష్ అనే పదో తరగతి విద్యార్థికి కుక్కకాటు వేయడంతో గాయపడ్డాడు. వివరాలు.. గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు మహేష్ పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం పబ్లిక్ పరీక్ష లేకపోవడంతో ఆడుకునేందుకు స్నేహితుడి ఇంటికి వెళ్తుండగా కుక్క ఒక్కసారిగా మహేష్‌పై దాడి చేసి గాయపరిచింది. కుటుంబీకులు వెంటనే గ్రామంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ వైద్య, ఆరోగ్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో.. గుత్తి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

యల్లనూరు:మరమ్మతుల కారణంగా వెన్నపూసపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో వెన్నపూసప ల్లి, పాతపల్లి, గడ్డంవారిపల్లి, దగ్గుపల్లి, కోడుమూర్తి గ్రామాల్లో బుధవారం ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవీంద్ర తెలిపారు. వినియోగదారులు గమనించాలన్నారు.

గడ్డివామి దగ్ధం

గుంతకల్లు రూరల్: మండలంలోని గుండాల తండాలో మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్‌కు నిప్పంటుకుని అగ్గిరవ్వలు ఎగిసి పడటంతో పక్కనే ఉన్న గడ్డివామికి నిప్పంటుకుని కాలిపోయింది. ఘటనలో రూ.30 వేల దాకా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులాలూ నాయక్ వాపోయాడు.

రోడ్డు నిబంధనలు పాటించండి

గార్లదిన్నె: రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ కౌలుట్లయ్య సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసులు ఆటో యజమానులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా,పోలీసులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించండి

గుత్తి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని బాచుపల్లి జంగాల కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఈఓఆర్డీ శివాజీరెడ్డితో కలిసి ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

పుట్లూరు: మండలకేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద పుట్లూరు మండలంతో పాటు యల్లనూరు, తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు మండలాల ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త సేకరణ, వర్మీకాంపోస్టు తయారీ తదితర విషయాలపై ఎంపీడీఓ అలివేలమ్మ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబుశేషు, ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంప్ హౌస్‌ల పరిశీలన

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోనిఓల్డ్ మున్సిపల్ కార్యాలయం , అనంతపురం రోడ్డు, లచ్చానపల్లి రోడ్డులో ఉన్న తాగునీటి పంప్ హౌస్‌లను మంగళవారం కమిషనర్ జబ్బార్‌మియా పరిశీలించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ హేమచంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

24న బియ్యం, బేడల వేలం

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా భక్తులు స్వామికి సమర్పించిన బియ్యం, బేడలకు ఈ నెల 24న చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ సుబ్రమణ్యం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా రూ.10 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

నాటక ప్రదర్శనలు జయప్రదం చేయండి

పామిడి: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శ్రీవిశ్వావసు తెలుగు నామ సంవత్సర వార్షికోత్సవాల్లో భాగంగా సృజనాత్మక తెలుగుభాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తలపెట్టిన రెండు గొప్ప రంగస్థల పౌరాణిక ఉచిత నాటక ప్రదర్శలను జయప్రదం చేయాలని స్థానిక స్వరరాగ నాటక కళాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.దేవరాజు, గౌరవాధ్యక్షుడు పుంజా కృష్ణారావుయాదవ్, డైరెక్టర్, స్టేజీ మేనేజర్ బెస్త సుబ్రమణ్యం మంగళవారం కోరారు. ఈనెల 21న రాత్రి స్థానిక టీసీ హైస్కూల్‌లో, 27వ తేదీ రాత్రి గార్లదిన్నె మండలం కొప్పల కొండలో సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

'బ్లాక్ స్పాట్‌లపై దృష్టి సారించండి'

గార్లదిన్నె: రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు బ్లాక్ స్పాట్‌లపై దృష్టి సారించాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం డీఎస్పీ గార్లదిన్నె మండలంలో 44వ జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్‌లను పరిశీలించారు. బ్లాక్ స్పాట్‌లలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, ప్రమాద సూచికలు, సైన్ బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గుత్తి రూరల్: ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు, ఏఎంఓ సత్యనారాయణ, బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని బాచుపల్లిలో జ్వరాలు వ్యాపించడంతో సర్పంచ్ కె.రమేష్‌నాయుడు, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ శివాజీరెడ్డితో కలిసి మంగళవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రామచంద్రనాయక్, సూపర్‌వైజర్ రాఘవరెడ్డి, కార్యదర్శి సాదిక్, వైద్య సిబ్బంది రామకృష్ణ, అంజనేయులు, శివప్రసాద్, కళావతి, సునీత, సీహెచ్‌ఓ లక్ష్మీప్రసన్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి చేయాలి

పెద్దవడుగూరు: మహిళా అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీటీ సీఓ లాలుస్వామి, సంఘం సభ్యులు అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దవడుగూరు ఆర్డీటీ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ లో ఆర్డీటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది, పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సంజీవనగర్‌లో ఓ నివాస గృహంలో పేకాట ఆడుతున్న 9 మందిని మంగళవారం సీఐ సాయిప్రసాద్ అరెస్ట్ చేసారు. వారి నుంచి రూ. 67,890 నగదుతోపాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం మోదీకి కృతజ్ఞతలు

తాడిపత్రి రూరల్: పీఎంవిశ్వకర్మ అదరణ పథకం కింద 18 రకాల కులవృత్తుల వారికి ఉచిత శిక్షణ కల్పించి అభివృద్ధికి అడుగు వేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నాయీ బ్రహ్మణ సంఘం నాయకులు, బీజేపీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆయన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. జిల్లా నాయీబ్రహ్మణసంఘం అధ్యక్షుడు రామక్రిష్ణ, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు అంకాల్‌రెడ్డి, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ ప్రతాప్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు క్రిష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో రీ సర్వే

పుట్లూరు: మండలంలోని గరుగుచింతలపల్లి, కందికాపుల గ్రామాల్లో బుధవారం నుంచి రీ సర్వే ప్రారంభమవుతుందని తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయన ప్రజలతో సమావేశం నిర్వహించారు. రీ సర్వే అధికారులకు రైతులు సహకరించాలన్నారు. సమావేశంలో సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

పుట్లూరు: మండలంలోని ఏ.కొండాపురం వద్ద చేపడుతున్న ఎన్‌హెచ్ 544డీ రోడ్డు నిర్మాణ పనులను ఆర్డీఓ కేశవనాయుడు పరిశీలించారు. ఎవరైనా రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి సమస్యన్నా తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. తహసీల్దార్ శేషారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌ప్రసాద్, వీఆర్‌ఓ రామక్రిష్ణ, సిబ్బంది ఉన్నారు.

పురాతన నంది విగ్రహం చోరీ

పెద్దవడుగూరు: మండలంలోని విరుపాపురం గ్రామ సమీపంలో వంక గడ్డ వద్ద ఉన్న పురాతన నంది విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. వంక గడ్డున పూర్వీకులు నందీశ్వరుని విగ్రహం ఏర్పాటు చేసి పూజలు చేసే వారని గ్రామస్తులు తెలిపారు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన తమకు నంది విగ్రహం కనపడక పోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదన్నారు. దీంతో విగ్రహాన్ని చోరీ చేసినట్లుగా నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

పలువురు దుకాణదారులకు జరిమానా


కిరాణా షాపులో తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ శంకర్

పామిడి: మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో మంగళవారం సాయంత్రం తూనికలు, కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గణపతి కిరాణా షాపులో ఆహార దినుసుల ప్యాకింగ్‌పై సరైన వివరాలను ముద్రించని విషయాన్ని గుర్తించి దుకాణ నిర్వాహకుడికి రూ.15 వేలు జరిమానా విధించారు. అలాగే గణేష్ ఎలక్ట్రికల్ షాపులో టాయిలెట్ ఫ్లష్ ట్యాంకుపై కస్టమర్ కేర్‌కు సంబంధించిన సమాచారం లేకపోవడంతో రూ.20 వేలు అపరాధ రుసుం విధించారు.